క్లుప్తంగా

శిశుగృహకు ఫైర్‌సేఫ్టీ పరికరం అందజేత



పరికరాన్ని అందజేస్తున్న మౌనిష్ రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని శిశుగృహకు సోమవారం పట్టణానికి చెందిన ముడుపు మౌనిష్ రెడ్డి ఫైర్ సేఫ్టీ పరికరాన్ని అందజేశారు. శిశుగృహ అధికారుల విన్నపం మేరకు పరికరాన్ని అందజేసినట్లు పేర్కొన్నారు. తన వంతు సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని ఆయన తెలిపారు. ఆయన వెంట దినేష్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జేఎల్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఆదిలాబాద్ పట్టణంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హింగోలి సత్యనారాయణ, కార్యదర్శిగా సూరజ్ సింగ్, ఉపాధ్యక్షుడిగా కేశవులు, సంయుక్త కార్యదర్శిగా కె.వెంకటేశ్వర్లు, మహిళ కార్యదర్శిగా సరితరాణి, కోశాధికారిగా రాథోడ్ శ్రావణి, రాష్ట్ర కౌన్సిలర్లుగా స్వామి, అనిల్ కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా గణేశ్ కుమార్, శంకర్‌లు, ఎన్నికల పర్యవేక్షకులుగా షేక్ మోసిన్‌లు వ్యవహరించారు. నూతన కార్యవర్గ సభ్యులు డీఐఈవో రవీందర్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

బాధిత కుటుంబానికి ఆడే గజేందర్ పరామర్శ

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏలేటి రామరెడ్డి తల్లి మృతిచెందిన విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ బాధిత కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. మండల అధ్యక్షుడు వసంత్ రావు, యువజన అధ్యక్షుడు పోతారెడ్డి, ఏలేటి రాజురెడ్డి, శంకర్, హీరా సింగ్, నారాయణ రెడ్డి, మురళీ, నారాయణ, పెద్దా రెడ్డి ఉన్నారు.


టీచర్ల సర్దుబాటు నిలిపివేయాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటును నిలిపివేయాలని బహుజన టీచర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. ఒక పాఠశాల నుంచి ఉపాధ్యాయులను మరో పాఠశాలకు సర్దుబాటు చేయడంతో విద్యార్థుల చదువులకు నష్టం వాటిల్లుతుందన్నారు. సర్దుబాటు నిలిపివేసి విద్యా వాలంటీర్ల నియామకాలు చేపట్టాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను డీఎస్సీ ద్వారా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

27న బంజార సేవా సంఘ్ సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: బంజార సమస్యలపై ఈ నెల 27న జాతీయ బంజార సేవా సంఘ్ సమావేశాన్ని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘ్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్ అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించే సమావేశంలో బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు వివిధ డిమాండ్లను చర్చించనున్నట్లు తెలిపారు. సమావేశానికి బంజార సేవా సంఘ్ జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, బంజార మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, జెడ్పీ మాజీ చైర్మన్ హాజరు కానున్నట్లు తెలిపారు.

పాఠశాలలో తాగుబోతుల బీభత్సం



టాయిలెట్‌లో బీరు సీసాల గాజు ముక్కలు

జైనథ్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తాగుబోతులు బీభత్సం సృష్టించారు. ఆదివారం సెలవు రోజు కావడంతో గుర్తు తెలియని వారు పాఠశాల గోడదూకి, మందు తాగారు. ఖాళీ బీరు బాటిళ్లు, మందు సీసాలను అక్కడే వదిలేయడంతో పాటు, బీరు బాటిళ్లను విద్యార్థినుల టాయిలెట్లలో పగలగొట్టారు. ఉదయం విద్యార్థినులు వచ్చి చూడగా, పగిలిన సీసాల గాజు ముక్కలు ఉండటంతో ఉపాధ్యాయునులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వసతులు కరువు..!




నిలిచిన అదనపు గదుల నిర్మాణ పనులు

- సరిపడా గదులు లేక తిప్పలు
- శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు
- ఇబ్బందుల్లో పాఠశాల విద్యార్థులు

తాంసి: మండలంలోని గిరిజన ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులు వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీస సౌకర్యాలు కూడా కరువవడంతో అవస్థల నడుమ చదువులు కొనసాగిస్తున్నారు. చాలీచాలని గదుల్లో చదువుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. గదుల కొరత కారణంగా తరగతి గదిలోనే మధ్యాహ్నం చదుకుంటూ, రాత్రి వేళ పడుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మరోపక్క మరుగుదొడ్లు, మూత్రశాలలు సైతం శిథిలావస్థకు చేరాయి. విద్యార్థుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు లేక వారికి అవస్థలు తప్పడం లేదు. నూతన మరుగుదొడ్లు, స్నానపుగదులు మంజూరైనా పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి.

సరిపడా లేని గదులు..

మండల కేంద్రంలోని ఆశ్రమోన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఉండగా, పాఠశాలలో 117 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల ఆవరణలో నిర్మించిన గదులు శిథిలావస్థకు చేరడంతో గతంలో వాటిని తొలగించారు. నూతనంగా అదనపు గదుల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. గతేడాది రూ.35 లక్షలతో అదనపు గదుల నిర్మాణ పనులను సైతం ప్రారంభించారు. పనులు దక్కించుకున్న గుత్తేదారు నిర్మాణ పనులు పూర్తిచేయకుండానే వదిలేశారు. దీంతో ఆశ్రమ పాఠశాల విద్యార్థులు గదుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ఎదురుగా ఉన్న శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక దుర్గంధం వెదజల్లుతోంది. నూతనంగా నిర్మిస్తున్న ముగుగుదొడ్లు, మూత్రశాలల పనులు సైతం అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆశ్రమ పాఠశాలలో వసతులు మెరుగుపర్చాలని విద్యార్థులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు కనిపించకుండా ఏర్పాటు చేసిన గ్రీన్‌మ్యాట్

అవస్థలు పడుతున్నాం



పాఠశాలలో పూర్తిస్థాయిలో సరైన సౌకర్యాలు లేక అవస్థలు పడుతున్నాం. గదులు లేక తరగతి గదిలోనే పడుకుంటున్నాం. మరుగుదొడ్లు, స్నానపు గదులు సైతం సరిగా లేవు. పాఠశాల, తరగతి గదులకు ఎదురుగా ఉండటంతో దుర్గంధం వస్తోంది. అధికారులు నూతనంగా మరుగుదొడ్లు నిర్మించాలి.

– లోకేశ్, 7వ తరగతి

గదులు నిర్మించాలి..



పాఠశాలలో సరిపడా గదులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. హాస్టల్ గదులు లేక తరగతి గదిలోనే ఉండాల్సి వస్తోంది. నూతనంగా నిర్మిస్తున్న భవనం పూర్తిచేస్తే గదుల కొరత ఉండదు. అధికారులు దృష్టి సారించాలి.

– ప్రవీణ్, 10వ తరగతి

విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

నేరడిగొండ: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నేరడిగొండ మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు, బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, గుడిహత్నూర్ మండల నూతన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

కాలనీలో తిరుగుతూ.. సమస్యలు తెలుసుకుంటూ..

బోథ్: మండల కేంద్రంలోని నూ కాలనీలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సోమవారం పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కాలనీలోని సమస్యలు తెలుసుకున్నారు. కాలనీలో డ్రెయినేజీ ప్రారంభించాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కాలనీలో రోడ్డు, విద్యుత్ స్తంభాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే కాలనీవాసులకు హామీ ఇచ్చారు. పిప్పల్‌ధరి గ్రామంలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ తొడసం భూమన్న కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, నాయకులు ఉన్నారు.

హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎదులాపురం: హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నముల కిరణ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త బ్లాక్ డే సందర్భంగా సీడబ్ల్యూసీ గోదాంలో హమాలీలతో కలిసి నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సీడబ్ల్యూసీ, ఎఫ్‌సీఐ, స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ తదితర గోదాముల్లో హమాలీలు పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వాలు హమాలీల సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. వెంటనే హమాలీలకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పలువురు హమాలీలు సీఐటీయూలో చేరారు. నాయకులు దస్తగిరి, శంబాజీ, వసంత్, గోపాల్, ప్రమోద్, రోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్

పీఆర్‌టీయూటీఎస్ మండల కమిటీ ఎన్నిక

తాంసి: పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా జక్కుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని పీఆర్టీయూ భవనంలో నిర్వహించిన సమావేశంలో పీఆర్టీయూ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తాంసి మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తుల శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడిగా రవీందర్, మహిళ ఉపాధ్యక్షురాలిగా సరితతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నార్నూర్: పీఆర్‌టీయూ టీఎస్ సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా జాదవ్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాథోడ్ డిగాంబర్, అసోసియేట్ అధ్యక్షుడిగా చౌహాన్ హరిచంద్, మహిళ ఉపాధ్యక్షులుగా శకుంతల, కార్యదర్శిగా జాదవ్ జగన్నాథ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు గోవిందరావు, సంతోష్‌కుమార్‌లు వ్యవహరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బాలచందర్ టాకరే, జిల్లా ప్రధాన కార్యదర్శి కూడల రవీందర్, సంఘం మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ ఉత్తమ్, మాజీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాల బిల్లులు ఇవ్వాలని నిరసన

ఇచ్చోడ: గత నాలుగు నెలల నుంచి పాల బిల్లులు ఇవ్వకుండా పాడి రైతులను ఆందోళనకు గురి చేస్తున్నారని సోమవారం మండల కేంద్రంలో పాడి రైతులు పాలు రోడ్డుపై పోసి నిరసన తెలిపారు. పలువురు పాడి రైతులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సహకార సమైఖ్య, ఇచ్చోడ మిల్క్ కూలింగ్ యూనిట్‌లో పాల బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. దాదాపుగా నాలుగు నెలల నుంచి పాల బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి పాల బిల్లులు ఇప్పించాలని డిమాండ్ చేశారు. నాలుగు నెలల నుంచి బిల్లులు రాక పోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు.



ఇచ్చోడలో రాస్తారోకో చేస్తున్న పాడి రైతులు

లేబర్‌కోడ్, రైతుచట్టాలు రద్దు చేయాలి

ఎదులాపురం: బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ, టీయూసీఐ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 'బ్లాక్ డే' పేరుతో, కేంద్ర కార్మిక సంఘాలు, కిషన్ సంయుక్త మోర్చల పిలుపు మేరకు నిరసన చేపట్టారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో ఫ్లెక్సీ బ్యానర్, నల్ల జెండాలతో ఆందోళన నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.జగన్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజు, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమ్రే. నితిన్, రాజు, మారుతి, మహేందర్, రమేశ్, మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ముజీబ్, రిమ్స్ బ్రాంచ్ కార్యదర్శి ఖాసీం, జిల్లా నాయకులు సైఫ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లతో కార్మికులకు కనీస రక్షణ కరువైందని ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మిట్టపల్లి భీమ్‌రావు అన్నారు. ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రీజియన్ అధ్యక్షుడు ఎస్. భీంరావు, డిపో కార్యదర్శి ఎం.ఆశన్న, దత్తు, రమేశ్, వెంకటి, రవి, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి కల్లపెల్లి గంగయ్య ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక విధానాల్లో భాగంగా 29 కార్మిక చట్టాలను పూర్తిగా సవరించి, 4 కోడ్‌లను తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్మిక సంఘం నాయకులు కొత్తూర్ లక్ష్మణ్, షేక్ అహ్మద్, పాండురంగ్ తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గంగయ్య

కుమురంభీం వర్ధంతి సభ విజయవంతం చేయాలి

ఉట్నూర్‌రూరల్: జోడేఘాట్‌లో అక్టోబర్ 17న ఆదివాసీల ఆరాధ్యదైవం కుమురంభీం 84వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏకు వచ్చిన కుమురంభీం మనుమడు సోనేరావు ఆయా సంఘాలతో సమావేశం నిర్వహించారు. సభకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. రాంజీగోండ్ ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు మర్సుకోల తిరుపతి, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కా బాపురావు, చంద్రభాన్, హన్మంతరావు, గజానంద్, జంగు, రఘునందన్, బీర్షన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సోనేరావు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఆదిలాబాద్‌రూరల్: గ్రామాల్లో తాగునీటి సరఫరా చేసే గ్రామ మంచినీటి సరఫరా సహాయకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మిషన్ భగీరథ ఎస్ఈ ఎ.సురేశ్ అన్నారు. తాగునీటిని ఎలా పరీక్షించాలి, బోరుబావులు, పైపులైన్లు ఎలా మరమ్మతులు చేపట్టాలనే విషయాలను వివరించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్‌రూరల్ ఎంపీడీవో సమావేశ మందిరంలో నిర్వహించిన ఎంపీడబ్ల్యూఎస్ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డిప్యూటీ ఈఈ దేవన్న, మండల ప్రత్యేక అధికారి పద్మభూషన్, ఆదిలాబాద్‌రూరల్, మావల ఎంపీడీవోలు నాగేశ్వర్ రెడ్డి, శంకర్, ఎంపీవో ఆనంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు పాల్గొన్నారు.

గ్రామాల్లో పకడ్బందీగా నీటిసరఫరా చేయాలి

ఇచ్చోడ: గ్రామాల్లో ప్రతీరోజు మిషన్ భగీరథ నీటిని పకడ్బందీగా సరఫరా చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. సోమవారం మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామపంచాయతీ సహాయకులకు నిర్వహించిన శిక్షణ శిబిరంలో పాల్గొని మాట్లాడారు. నీటి సరఫరాలో నిర్లక్ష్యం ఉండవద్దన్నారు. నీటిసరఫరాలో ఇబ్బందులు ఉంటే పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్, పంచాయతీ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మిషన్ భగీరథ ఎస్ఈ సురేశ్

హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు శిక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో సోమయ్య

ఆదిలాబాద్‌రూరల్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి దోన్కురి సోమయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఆదిలాబాద్‌రూరల్, మావల, ఆదిలాబాద్అర్బన్, తలమడుగు మండలాలకు చెందిన ఎంఐఎస్ కోఆర్డినేటర్, ఐఈఆర్పీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గెజిటెడ్ నం.2 పాఠశాలలో ఈనెల 27 నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఇందులో ప్రధానంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చే విధానంపై శిక్షణ ఉంటుందని తెలిపారు. ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

భీంపూర్ తహసీల్దార్‌గా నలందప్రియ

తాంసి: భీంపూర్ మండల నూతన తహసీల్దార్‌గా నలందప్రియ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ బదిలీల్లో భాగంగా భీంపూర్ తహసీల్దార్‌ను ఇచ్చోడకు బదిలీ చేయగా, కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నలందప్రియను ఇక్కడికి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఆమెకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కళాశాల గుర్తింపుపై పీవో అభినందన

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో గల తెలంగాణ గురుకుల ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ బాలికల కళాశాలను ఇటీవల ఎన్ఏఏసీ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) టీమ్ సభ్యులు ఉమారాణి, శివరాం ప్రసాద్, ఆగస్టిన్ ఇటీవల సందర్శించి కళాశాల నిర్వహణపై బీప్లస్‌ప్లస్ గ్రేడ్ అందించడంతో నిర్వాహకులు, విద్యార్థులను ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా సోమవారం అభినందించారు. ప్రిన్సిపాల్ హరిత, అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.



అభినందిస్తున్న ఖుష్బూ గుప్తా

సంక్షిప్త వార్తలు

'పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి'

ఆదిలాబాద్‌టౌన్: పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కరీంనగర్‌కు చెందిన విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేలా పట్టభద్రులు కృషి చేయాలన్నారు. ఓటు నమోదు కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 30 నుంచి నవంబర్ 6 వరకు ఓటు నమోదుకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

మొక్కల సంరక్షణకు ట్రీగార్డులు ఏర్పాటు

నార్నూర్: ఉపాధిహామీ పథకంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణ కోసం ట్రీగార్డులు ఏర్పాటు చేసి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీవో సురేశ్ అన్నారు. సోమవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామం వద్ద ప్రధాన రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కల సంరక్షణ కోసం ట్రీగార్డులు ఏర్పాటు చేశారు. టీఏ సాధిక్, ఎఫ్ఏ మోతిరామ్ తదితరులు ఉన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమిపూజ

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిధుల కొరతతో నిర్మాణం మధ్యలో ఆగిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శశికళ భూమిపూజ చేశారు. తరగతి గదుల నిర్మాణం కోసం కలెక్టర్ రాజర్షి షా నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

30న ఉపాధిహామీ ప్రజావేదిక

బోథ్: మండలంలో ఈ నెల 30న ఉపాధిహామీ ప్రజావేదికను నిర్వహించనున్నట్లు ఉపాధిహామీ ఏపీవో జగ్దేరావ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 -24 ఆర్థిక సంవత్సరానికి మండలంలో జరిగిన పనులకు సంబంధించిన అభివృద్ధి, లోటుపాట్లపై వివరించనున్నట్లు తెలిపారు.

లంబాడాతండా సందర్శన

బోథ్: మండలంలోని లంబాడాతండా గ్రామాన్ని ఎంపీడీవో జీవన్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు.అనంతరం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. రూప్‌చంద్, బాబులాల్ పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

బోథ్: మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 25న మార్కండేయ ఆలయం వద్ద గల తమ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సొసైటీ అధ్యక్షులు మాసం అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మట్లాడుతూ తన అన్న హోంగార్డు మాసం కిరణ్ కుమార్ మొదటి వర్ధంతి సందర్భంగా ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సహకారంతో కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వ సహకారం

నేరడిగొండ: చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి ప్రభుత్వం పరిశ్రమల శాఖ ద్వారా సహకారం అందిస్తుందని ఆర్థిక అక్షరాస్యత సంస్థ కౌన్సిలర్ సంతోష్ అన్నారు. సోమవారం మండలంలోని వడూర్ గ్రామంలోని రైతువేదిక భవనంలో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి సద్దాం, ఐకేపీ సిబ్బంది, పెందూర్ దంజి, అరవింద్, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వారసులకు అవకాశం కల్పించండి

బోథ్: ఎలాంటి బెనిఫిట్స్ లేకుండా రిటైర్డ్ అవుతున్న తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని 55 సంవత్సరాలు పైబడి రిటైర్డ్ అవుతున్న వీఆర్ఏలు తహసీల్దార్ సుభాష్ చందర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. తమ వారసులకు ఉద్యోగ అవకాశం ఇవ్వాలని కోరారు.

మెగా అభిమానుల సంబరాలు

ఆదిలాబాద్: సినీ హీరో మెగాస్టార్ చిరంజీవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్న నేపథ్యంలో సోమవారం మెగా ఫ్యామిలీ అభిమానులు సంబరాలు నిర్వహించుకున్నారు. జిల్లా కేంద్రంలోని మహేశ్వరి థియేటర్లో శ్రీ అంజనీపుత్ర మెగా ఫ్యామిలీ ఫ్యాన్స్ సేవా సమితి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

కామర్స్ బోధనకు ఆహ్వానం

బజార్‌హత్నూర్: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పీజీటీ కామర్స్ సబ్జెక్ట్ బోధించుటకు ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 24 నుంచి 26 వరకు ఆదర్శ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సంగీత తెలిపారు. 9948597972 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఘనంగా సంకల్ప దినోత్సవం

ఇంద్రవెల్లి: అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంకల్ప దినోత్సవాన్ని సోమవారం మండలకేంద్రంలోని మిలింద్‌నగర్ బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, నాయకులు కామ్‌రాజ్ వాగ్మరే, మస్కే రాజువర్ధన్, దిలీప్ మోరే తదితరులు ఉన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

బోథ్: తెలంగాణ గ్రామీణ బ్యాంకులో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే తిరిగి రుణాలు అందిస్తామని టీజీబీ చైర్మన్ శోభ అన్నారు. సోమవారం సొనాల గ్రామంలోని బ్యాంకును ఆమె సందర్శించారు.

చందా వాగు వద్ద స్వచ్ఛత కార్యక్రమం

కైలాస్‌నగర్: స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆదిలాబాద్ పట్టణ శివారులోని చందా వాగు వద్ద మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని చందావాగు ఘాట్ పరిసరాలను శుభ్రం చేశారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులతో పాటు మెప్మా సిబ్బంది, శానిటరీ జవాన్లు వాగులో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. వాగులో కరిగిపోని వినాయక ప్రతిమలను తొలగించి వాగు ఘాట్‌ను శుభ్రం చేశారు. శానిటరీ ఇన్స్‌పెక్టర్ శంకర్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ అవికిరణ్, హెల్త్ అసిస్టెంట్ పోశెట్టి, టీఎంసీ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిమలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది